# పరిచయం

## 2 కొరింథీయులు

“... అతడేలాగు క్రీస్తువాడో ఆలాగే మేమును క్రీస్తువారము ...” (10:7).

సుప్రసిద్ధుడైన పరిచారకుడొకడు అతి తరచుగా నౌకలకు భంగం కలుగుతున్న ప్రమాదకరమైన ఒక సముద్రతీరాన వెలసిన ప్రాణరక్షణా శిబిరాన్ని గురించి నిదర్శనంగా ఒక కథను చెప్పాడు. ఆ శిబిరంలో స్వయంసేవకులు పడవ మునక బారిన పడిన వారిని కాపాడడానికి తమ జీవితాలను పణంగా పెట్టారు. ఈ ప్రాణరక్షణా శిబిరం వ్యాప్తిలోనికి వచ్చినకొలది ఆ సేవాదళం సభ్యులు పడవలను నిలపడానికి షెడ్లను, సముద్రంలో నుండి బయటకు లాగిన వారిని ఒక చోట ఉంచడానికి ఆశ్రయ స్థావరాలను ఏర్పరచారు. అటుపైన పడవ మునక బాధితుల సౌకర్యం కోసం ఒక భవనాన్ని కట్టారు. దానికి తోడుగా సభ్యులు తమ కొరకు విశేషమైన భోజన శాలలను, ఆట గదులను, విశ్రాంతి స్థలాలను నిర్మించుకొని ఆనందంగా కాలం గడుపసాగారు. రానురాను ఆ శిబిరానికి చాలా గుర్తింపు వచ్చి అనేక మంది ఉన్నత వ్యక్తులు అందులో సభ్యులుగా చేరారు. రానురాను ప్రాణ రక్షణా చర్యలకుగాను తమకు బదులుగా ఇతరులను నియమించి, వారికా పనులను అప్పగించి తాము క్లబ్‌ల్లో ఉల్లాసంగా ఉండసాగారు.

ఇలాంటి పరిణామంవలన ఈ లైఫ్ సేవింగ్ స్టేషన్‌లోని సభ్యులు కొందరు, ఆ సంస్థ ఏ పనికైతే ఏర్పడిందో, దాని మూలభూత ప్రయోజనాన్ని కోల్పోయిందని కలవరపడ్డారు. వారు తమ సభ్యత్వానికి రాజీనామా చేసి సముద్రతీరానికి దిగువగా మరొక లైఫ్ సేవింగ్ స్టేషన్‌ను ఏర్పరచారు. కాని ఇది కూడ కొన్ని సంవత్సరాలకు వ్యాప్తిచెంది మొదటిదానివలెనే దిగజారింది. అప్పుడు ఈ సంస్థనుండి కూడ మరికొందరు తొలగిపోయి మరొక కొత్త స్టేషన్‌ను నెలకొల్పారు. మీరు కనుక సముద్రతీరం వెంబడి వెళ్లితే ఈ రకమైన క్లబ్బుల వరుస కనుపిస్తుంది. ఎప్పటివలెనే ఈ సముద్రంలో నౌకలకు ముప్పువాటిల్లి అవి మునిగిపోతున్నా ఏ ఒక్క రక్షణా స్టేషన్ సహాయక చర్యలకు ముందుకు రాలేదు.

ఈ కథలోని సారాంశాన్ని అర్థం చేసుకొనడం ఏమంత కష్టం కాదు. కొన్ని సంస్థలు శక్తిని, బలమును కలిగి ఉండికూడా తమ మూలభూత ప్రయోజనాన్ని కోల్పోతున్న విషయం మనకు తెలిసినదే. ఇలాంటి పరిణామమే సంఘ జీవితంలోనూ, పరిచర్యలలోనూ జరుగుతుంటాయి. మనం మన జీవితంలో అనుసరిస్తున్న పర్యాయ పద్ధతులను పరిశీలించినప్పుడు, కొన్ని ముఖ్యమైన ప్రశ్నలు కలుగుతాయి. ఈ ప్రత్యామ్నాయ చర్యలన్నీ సంఘ ప్రయోజనాన్ని నిర్దిష్టంగా సమకూర్చగలవా? ప్రత్యామ్నాయ చర్యలలో అధికారికమైనవి ఏవి అని నిర్ణయించడానికి మనం ఎటువంటి కొలమానాలను గ్రహించాలి? సంఘం కూడ ప్రాణరక్షణా స్టేషన్‌కువలె

తన మూలభూతమైన ఉద్దేశాన్ని కోల్పోతుందా?

మన సంస్థలను గురించి తప్పుడు భావనలను క్రైస్తవ్యమని ప్రసార మాధ్యమం ప్రచారం చేసింది. పరిచర్యలను చేసేవారిని వేషధారులని, స్వార్థపరులని వర్ణించింది. సిన్‌క్లేర్ లూయిస్ ఎల్‌మర్ గాంట్రి తనకు తాను ప్రసిద్ధుడు కావడానికి, జనులను మోసగించడానికి మతాన్ని వాడుకొన్నాడు. మతాన్ని అనుసరించేవారు, మత సంస్థలు, కేవలం తమను తాము అభివృద్ధి పరచుకునేందుకు గాను ప్రాతినిధ్యం వహిస్తాయని మీడియా ఎప్పుడూ అటువంటి కథలను ప్రచారం చేయడానికి పూనుకుంటుంది. అత్యుత్తమమైన సాహిత్య రచనలో డోస్టో విస్కి, క్రమబద్ధంగా సంఘటితమైన మతము యొక్క ప్రామాణికతకు సంబంధించి లేచిన గంభీరమైన అనుమానాలను వివరించాడు. గ్రాండ్ ఇన్‌క్విస్టర్ కథానికలో *(The Brothers Karamazov)*, యేసు క్రీస్తు ఇలలో ఉన్న చిన్న స్పానిష్ పట్టణానికి తిరిగి వస్తాడని చెప్పాడు. వెంటనే మత సంస్థలు తమ కార్యాలలో జోక్యం కలిగించుకొనుటకు అతనికి అధికారం లేదని చెప్పి ఆయనను చెరసాల పాలు కావించారు. తుదకు యేసుకు, “వెళ్ళు యింక రావద్దు, యింకెప్పుడూ రానేవద్దు – ఎప్పుడూ, యింకెప్పుడూ!” అని చెప్పారు. క్రైస్తవ్యం తన ప్రమాణికత్వాన్ని కోల్పోతుందనేది ఈ గ్రంథకర్త ఉద్దేశం.

క్రైస్తవ్య ప్రమాణికత్వాన్ని గురించి ప్రశ్నించే వాళ్ళు క్రైస్తవుల యథార్థతను గురించి పట్టించుకున్నంతగా, వారు క్రైస్తవ సిద్ధాంతాలకు నిజంగా ప్రాతినిధ్యం వహిస్తున్నారా లేదా అన్న విషయాన్ని గురించి ఆసక్తి చూపరు. సాధారణంగా వారు చేసే విమర్శ ఏమిటంటే, ఎల్మర్ గాంట్రి ప్రకారం, క్రైస్తవ నాయకులు చిల్లర వర్తకులలాంటివారని, సంఘాలు తమ బలాన్ని, ప్రభావాన్ని విస్తరించడంలో తప్ప మరిదేనిపట్ల అభిలాషను కలిగి ఉండవని, క్రైస్తవులు తాము లోకంకంటే వేరుగా ఉన్నామని తమను గూర్చి చెప్పుకుంటున్నప్పటికి, వారు యేసుక్రీస్తువారి నియమాల కంటె లౌకిక నియమాలను కోరుకొంటారు కనుక ఈ విమర్శ కలిగింది.

ముందుగా మనం సంఘాన్ని గూర్చి, పరిచారకులను గూర్చిన సాధారణమైన చిత్రణను గురించి అందోళన చెందకూడదు. ఈ “విశ్వసనీయతను” గురించిన విభేదంలో మరొక విషయం కూడ ఉంది. క్రైస్తవ నాయకులు అవకాశవాదులని అనేవారు దానిని పక్షపాతబుద్ధితో నిర్ణయిస్తున్నారని కూడ మనం తీర్మాణించవచ్చు. కాని యిలాంటి విమర్శలను మనం అంత తేలికగా కొట్టివేయరాదని నేను ఒప్పుకున్నాను, ఎందుకనగా ప్రామాణికత పరీక్షలో మనం తప్పిపోయే అవకాశం ఉంది. నిజానికి, మనం సరియైన వాటినే చెప్పవచ్చు, సరియైన పద్ధతులనే అనుసరించవచ్చు, కాని విశ్వసనీయ క్రైస్తవులు కాకుండవచ్చు.

ప్రామాణికతను గురించిన ప్రశ్న సంఘము యొక్క ఉనికికి ప్రాథమికమైనది. అది అనేక విధాలుగా మనకు కలుగుతుంటుంది. ఉదాహరణకు, సమయ సమయానికి “సంఘ స్థితిని” గురించి అధికారికమైన సంఘం కావించవలసిన కార్యక్రమములను గురించి తెలిసుకొనుటకు ఒక స్థాయి ఉంది. దానికి ఉన్న బడ్జట్ మరియు భవనాలు సంఘానికి ఉన్న ప్రామాణిక దృకృథాన్ని ప్రతిబింబిస్తాయి. మనం ఎన్నుకున్న నాయకులు, పరిచారకులు సంఘం యొక్క ప్రామాణికతను ప్రతిబింబిస్తారు. మన దృష్టిలో ఋజువర్తనగల క్రైస్తవులని తీర్మానించిన వాళ్ళనే నాయకులుగా ఎన్నుకుంటాం. మనం తీసుకునే ప్రతి నిర్ణయం క్రైస్తవునిగా పిలువబడేవాడు ఎటువంటి గుణాలు కలిగి ఉండాలి అన్న మొదటి ప్రశ్నమీద తప్పక ఆధారపడి ఉంటుంది.

అధికారికమైన సంఘాన్ని గుర్తించడం ఎలా? అన్న ప్రాథమికమైన ప్రశ్న మన బడ్జెట్

మరియు భవనాల వాస్తవాల వెనుక మనకు కలుగుతుంటుంది. మన సమాజంలో జవాబులకు కొరతలేదు కాని సమస్య ఏమిటంటే, మనం పరస్పర విరుద్ధాలైన జవాబులతో నలిగి పోతుంటాం. ప్రామాణికమైన క్రైస్తవ్యం భిన్న వ్యక్తులకు భిన్నంగా ఉంటుంది. ఈ ప్రశ్నపై మనం ఏకాభిప్రాయానికి రాకపోయినట్టయితే ప్రమాధకరమైన పరిణామాలు కలుగుతాయి. వ్యక్తిగతమైన అనుభవాలను అనుసరించి ప్రామాణిక క్రైస్తవుని చిహ్నం గుర్తించాలని కొందరు అంటారు. తమ పరిచర్య స్వచ్ఛమైనదని తమ భావనలను సూచనలను నిరూపించే వారినుండి యిలాంటి జవాబు వినిపిస్తుంది. పరిచారకుడు పొందిన ప్రత్యక్ష విజయం రెండవ జవాబుకు పరీక్షగా నిలుస్తుంది. ప్రత్యక్ష ఫలితాలను గొప్పగా ప్రశంసించే సంస్కృతిగల సమాజంలో, మనం మన స్వంత క్రైస్తవ్యానికి ఈ పరీక్షను వర్తింప చేసుకోవచ్చు. మనం క్రైస్తవ్య విశ్వాసానికి సంతవీధిలోని విలువను వర్తింప జేసుకున్నప్పుడు, విశ్వాసానికి గల గుర్తింపు చిహ్నం ఒక పేజిపైగల కొన్ని అంకెల వరుసకు దిగజారిపోతుంది. ఒక సంఘం జయాపజయాలను అందులోని సభ్యుల సంఖ్య పెరుగుదల తరుగుదలలను బట్టి, ఆ సంఘం నిలవవున్న ఆస్తి మొత్తాన్ని బట్టి ఆధారం చేసుకొని నిర్ణయించవచ్చు. ఇలాంటి పద్ధతిని అనుసరించి సంఘం స్థాయిని పెంచి దానిని అనేకులకు ఆకర్షణీయంగా కావించవలసిన బాధ్యతను గుర్తించవచ్చు.

మరికొన్ని సందర్భాలలో, సాంఘీక, ఆర్థిక సమస్యలను పరిష్కరించడంలో సంఘం ఎంతవరకు పాల్గొన్నది అనే ప్రశ్నలను బట్టి విశ్వసనీయతకు సంబంధించిన పరీక్ష ధ్రువీకరించబడుతుంది. సంఘానికి సంబంధించిన ముఖ్యమైన సిద్ధాంతాలను చర్చనీయ విషయాలను నిర్ణయించడంలో ఇలాంటి పరీక్ష ఆవశ్యకమైనదని మరికొందరు అంటారు. ఈ విధంగా క్రైస్తవులను గుర్తించే విషయంలో పలు అభిప్రాయాలు వినివస్తాయి.

స్థానిక సంఘమును పరిచర్యగల సంఘంగా సిద్ధపరచుటకు పూనుకున్న పరిచారకులకు ఈ ప్రశ్న ప్రధానమైనది. పరిచర్యలో సంపూర్ణంగా పాల్గొనేవారు తమ కార్యాచరణకు సరియైన విధానాలను కనుగొనడంలో ఇబ్బంది పడుతుంటారు. అనేక సందర్భాలలో, పరిచర్యను చేయువారు, తాము చేయబూనిన కార్యక్రమాల ప్రణాళికలను సంఘానికి వెలుపటనుండి గ్రహిస్తారు. తమ సామర్థ్యాన్ని ఉన్నతిని వృద్ధి చేసుకోడానికి, కార్పరేషన్ ప్రమాణాలను పరిచారకుడు తూచి చూసుకోవాలని కొందరు అభిప్రాయ పడతారు. మరికొందరు పరిచారకుని మాదిరిని వృత్తి-సలహాదారుని అనుసరించి కొలుస్తారు. ఈ "గుర్తింపు ఆందోళన" కేవలం పరిచారకులదేకాదు, సంఘానికంతటికి సంబంధించి ఉంటుంది. మనం క్రైస్తవ నాయకత్వానికి సంబంధించి అనేక పర్యాయ అభిప్రాయాలను గమనించాం. మనం ఇప్పుడు క్రైస్తవుని గుర్తించదగిన విధానమేది అన్న ప్రాథమిక ప్రశ్నను తిరిగి వేసుకోవాలి.

## క్రొత్త నిబంధనను పొంచి వినుట

మనకు కలిగిన ప్రశ్నలు మొదటి శతాబ్దంలోనే అడగడం జరిగింది కనుకనే క్రొత్త నిబంధన బలప్రభావం యింకా కొనసాగుతుందని చెప్పవచ్చు. నిజానికి అప్పుడు ఇటువంటి ప్రశ్నలకే పత్రికలను వ్రాసారు. విశ్వసనీయమైన పరిచర్య ఎలాంటిదో తరచి తెలుసుకోవాలని అనుకున్నయెడల, పౌలు మరియు కొరింథీయుల నడుమ జరిగిన చర్చను "పొంచి వినుట వలన" మనకు ప్రయోజనం కలుగుతుంది. కొరింథీయుల సంఘ స్థాపనతో ఆరంభించి

(అపొస్తలుల కార్యములు 18:1–17ను పోల్చు), ఒక సంక్షోభమునుంచి మరొక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంఘంతో సంచలనాత్మకమైన బాంధవ్యాన్ని కలిగి ఉన్నాడు. ఈ సమస్యలు మొదటి కొరింథీయుల రచనతో కూడ విడిపోలేదు. పౌలు మొదటి కొరింథీయులకు వ్రాసిన వెంటనే, కొన్ని కొత్త సమస్యల సమూహం తలెత్తింది. మొదటి కొరింథీయులకు వ్రాసిన పత్రికను వారికిచ్చి తిమోతి, అచట క్రొత్త ప్రశ్నలున్నాయని పౌలుకు చెప్పడానికి తిరిగి వచ్చాడు.

కొరింథీయులు ఎదుర్కొంటున్న క్రొత్త సమస్యలను గూర్చి 10:1–11లో ప్రస్తావించ బడింది. పౌలును దాడికి గురియైన వ్యక్తిగా మనం గుర్తిస్తాం. నిజానికి, 10:1, 2లు పౌలు విమర్శకు గురియైనట్టు తెలుపుతున్నాయి. 10:1లో కొంత హాస్యాన్ని కూడ మనం చూడవచ్చు, ఎందుకంటే, అందులో పౌలుపై ఆపాదించబడిన సాధారణ విమర్శలను పేర్కొన్నాడు. 10:2 ప్రకారం, పౌలు "లౌకికమైన పద్ధతుల ప్రకారం" నడుచుకుంటున్నాడని "కొందరు" అంటారు (*kata sarka*; "భౌతికరీతిలో"). ఈ అంశం 10:7లో ఇంకా బలవత్తరంగా ప్రతిపాదించబడింది, అక్కడ పౌలు యిలా అంటాడు, "... ఎవడైనను తాను క్రీస్తువాడనని నమ్ముకొనినయెడల, అతడెలాగు క్రీస్తువాడో ఆలాగే మేమును క్రీస్తువారమని తన మనస్సులో తాను తిరిగి ఆలోచించుకొనవలెను." "క్రీస్తువారము" అనే పదాలను "క్రైస్తవులు" అనే పదంగా అనువాదం చేయవచ్చు. 2వ కొరింథీలో ప్రతిపాదించిన సమస్య ఏమిటంటే: క్రైస్తవుని చిహ్నం ఏది? దాడికి గురియైన పౌలు క్రైస్తవుడుగా తన అధికారిక పత్రాన్ని సమర్పించవలసినవాడై ఉన్నాడు. ఇదే 2 కొరింథీయులకు వ్రాసిన పత్రికలోని ప్రధాన విషయం.

పౌలు 2 కొరింథీయులకు వ్రాసిన పత్రిక అంతటిలో వాద ప్రతివాదం చేస్తున్నట్టు కనిపిస్తాడు. కొరింథీయులకు అతడు మొదటి పత్రికను వ్రాసిన తరువాత అతని క్రైస్తవ పరిచర్యను ప్రశ్నించేవారు కొరింథీకి వచ్చినట్టున్నారు. వారు తమ సొంత సిఫారసు పత్రాలతో వచ్చారు (3:1), మరియు వారు అపొస్తలులని, మరియు "నీతి పరిచారకులుగా" (11:13, 15) ప్రకటించుకున్నారు. అదే సమయంలో, తమను పౌలుతో పోల్చి చెప్పుకొని అతడు నిజమగు "క్రీస్తు పరిచారకుడు" (11:23) కాదని నిర్ణయించారు. పుస్తకాద్యంతంలో వారు యితర పరిచారకులతో తమను పోల్చుకొనడంలోనూ మరియు తమ శక్తిని వారితో తూచుకొనడంలోనూ ఆనందం పొందుతున్నట్టు కనిపిస్తుంది (3:1; 10:12, 18). పౌలు చాల సంకట స్థితిలో ఇరుక్కున్నాడు. "తనను" (10:12) యితరులతో పోల్చి చూడడం అతడు కోరుకొన్నది కాదు. అయినా, సంఘం నిమిత్తం, అతడు విశ్వసనీయుడైన క్రైస్తవుడనని వెల్లడి చేసుకొనవలసినవాడై ఉన్నాడు. 10:7లో పౌలు చెప్పుకొన్నది 11:23లో దృఢపరచినలాంటిదే, "వారు క్రీస్తు పరిచారకులా? ... నేనును మరి యెక్కువగా ... ."

పౌలు తాను "నిజమగు క్రైస్తవునిగా" చెప్పుకున్నది, ఒక పరిచారకుని జీవన పద్ధతి నడవడికలను గురించిన ప్రధానాంశాలను గురించిగాని ఒక ప్రత్యేక సిద్ధాంతాన్ని గురించిగాని కాదని మనకు జ్ఞప్తికి తెస్తుంది. అతని విరోధులు అతని విశ్వాసాన్ని గురించి ప్రశ్నించడం లేదు; క్రీస్తు పరిచారకుని చర్యలను ప్రశ్నిస్తున్నారు. నిజానికి కొరింథీయులకు వ్రాసిన 2వ పత్రికలో పరిచర్యను గురించిన చర్చనీయాంశం ఎంత ముఖ్యమైనదో అచటి పదపట్టికను సంగ్రహంగా పరిశీలిస్తే మనకు తెలిసివస్తుంది. "పరిచారకుడు" *(diakonos)* మరియు "పరిచర్య" *(diakonia)* అనే పదాలు, 2వ కొరింథీలోనూ ఇతర పౌలు పత్రికలలోనూ కనిపిస్తాయి. ఇంగ్లీషు

అనువాదకులు యితర పదాలు తరచుగా వాడినప్పటికి, *diakonia* అనే పదం పదునొకొండు సార్లు వాడబడింది (పోల్చు 3:7-9; 4:1; 5:18; 6:3; 8:4; 11:8), *diakonos* అనే పదం నాల్గు సార్లు వాడబడింది (3:6; 6:4; 11:5, 23). ఆ పదాన్ని తరచుగా వాడడం అధికారిక పరిచర్య 2 కొరింథీలోని ప్రధాన విషయమని తెలుపుతుంది. పౌలు తన పరిచర్య విధానాన్ని గురించిన దాడిని తట్టుకోడానికి పత్రికలను రాస్తాడు.

## క్రైస్తవుని గుర్తింపు

క్రమబద్ధమైన క్రీస్తు సేవకుని గుర్తింపు ఏది? ఏ విషయాన్ని ఆధారంగా చేసుకొని మనం పౌలుతో కలసి "క్రీస్తువారమని" (10:7) చెప్పుకుంటున్నాం? పౌలు మీద 10:1-11లో ఆపాధించబడిన విషయాలను గమనిస్తే ఎటువంటి "పరీక్షలను" పౌలు ఎదుర్కొన్నాడో మనం గ్రహించగలం: "అతని పత్రికలు ఘనమైనవియు బలీయమైనవియునైయున్నవి గాని అతడు శరీరరూపమునకు బలహీనుడు, అతని ప్రసంగము కొరగానిదని యొకడు అనును" (10:10). పౌలు ఆసక్తిని కలిగించు వక్త కాదు. ఈ విమర్శ అక్షరార్థంగా వివరించబడింది, ఒకడు తరచుగా అస్వస్థుడై ఉంటే (12:7), అతని "శరీరం" బలహీనంగా కనబడుతుంది. అతని "వినయ" స్వభావం (10:1) అతనికి ధైర్యం పనిచేయుటలో "సమయస్ఫూర్తి" లేవన్న భావాన్ని కలుగజేసింది. ఈ విమర్శ అక్షరార్థంగా పౌలు "లౌకిక విధానాన్ని" అనుసరిస్తున్నడన్న (భౌతిక విధానాన్ననుసరించి) విమర్శకు బలాన్నిచ్చింది. "పౌలు నిజంగా క్రైస్తవుడైతే, సామర్థ్యాన్ని కలిగి ఉండేవాడు, ప్రోత్సాహకరమైన వాక్చాతుర్యం ప్రదర్శించి ఉండేవాడు, లేక విజయాలను సాధించేవాడు." పౌలు ప్రభావితం చేయలేక పోవడం, అతడు క్రైస్తవుడు కాడని (10:7) లేక క్రీస్తు పరిచారకుడు కాడని (11:23) తెలుపుతుందంటారు.

క్రైస్తవుని "గుర్తింపు" అతని సామర్థ్యంవల్ల నిరూపించబడాలని విరోధులంటారు. అతడు ప్రభావితం కావించలేక పోవడం అతనిలో ఆత్మ శక్తి లేదని విరోధులకు తోచింది. పౌలు "ప్రపంచ విధానాన్ననుసరించి" పరిచర్యను సాగిస్తున్నాడని విరోధులు నేరారోపణను కావించినప్పుడు, అతడు "స్ఫూర్తి" లేనివాడని అతనిని నిందించారు. "లోకరీతిగా" (*kata sarka*) అనే పదం సాధారణంగా "ఆత్మానుసారంగా" (*kata pneuma,* రోమీయులకు 8:4, 5) అనే పదానికి విరుద్ధమైనది. పౌలు తన "బలహీనమైన" శరీరం మరియు ప్రసంగాలతో విరోధుల విశ్వసనీయ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేకపోయాడు.

వారి ఆరోపణలకు పౌలు యిచ్చిన జవాబులలో మనం కొంత వ్యంగ్యాన్ని గమనించవచ్చు: "మీ ఎదుటనున్నప్పుడు మీలో అణకువగలవాడనైనట్టియు, ఎదుట లేనప్పుడు మీయెడల ధైర్యముగలవాడనైనట్టియు, పౌలను నేను యేసు క్రీస్తు యొక్క సాత్వికమును మృదుత్వమునుబట్టి మిమ్మును వేడుకొనుచున్నాను" (10:1). "సాత్వికము మరియు మృదుత్వము" అనే ఈ పదాలు వినయ పూర్వకంగా మోకరించుటను, అణుకువగల స్థితిని సూచిస్తాయి. అయితే లోకం బలహీనమైన లక్షణాలుగా తలచేవి పౌలుకు క్రైస్తవుని చిహ్నాలుగా, క్రీస్తును సేవించుటకు ఆచరించదగిన సరియైన పద్ధతులుగా ఉన్నాయి. విరోధులకు అనర్హుడుగా కనిపించిన లక్షణాలు పౌలుకు క్రైస్తవుని చిహ్నాలుగా, క్రీస్తును సేవించుటకు ఆచరించదగిన సరియైన లక్షణాలుగా ఉన్నాయి. విరోధులకు పౌలు అనర్హునిగా తోచిన గుణ గణాలు అతడు క్రీస్తువాడని (10:7) గుర్తింపబడుటకు చిహ్నాలుగా అంగీకరించబడ్డాయి.

అతడు "సాత్వికంగానూ మృదువుగానూ" చదువరులను వేడుకొంటున్నాడు. పౌలు పరిచర్యకు క్రీస్తు స్వయముగా మాదిరియై ఉన్నాడు.

## మధ్యలో చిక్కుకొన్న ఒక సంఘం

పౌలు విరోధులు తమను తాము ప్రశంసించుకొనుచుండగా, పౌలు మాటలను విను కొరింథీయులను ప్రామాణికమైన క్రైస్తవులుగా మనం వారియెడల సానుభూతి చూపుదాం (5:12; 6:4). ఇరు పక్షాలవారు వేరువేరు ప్రమాణాలను చూపుతూ తాము న్యాయబద్ధమైన క్రైస్తవ పరిచారకులమని తెలిపారు. విశ్వసనీయమైన పరిచర్యను ఎన్నుకొని సంఘం ఎలా ఉండవలెనో తీర్మానించుటకు ఆహ్వానించబడింది. కొరింథీయులు విరోధుల మాటలకంటె పౌలు మాటలకు విలువనిచ్చి మంచి నిర్ణయానికి వచ్చారని అనుకుందాం.

నేడున్న సంఘాలకంటె మూల చదువరుల పరిస్థితి భిన్నంకాదు. కొన్ని సంవత్సరాల క్రితం మనం పరిగణించని కార్యక్రమాలు నేడు మనకు సాధ్యమౌతున్నాయి. మనకెలాంటి సంఘం కావాలో తప్పని సరిగా నిర్ణయించుకోదగిన ప్రత్యామ్నాయాల ఎదుట మనం నిలిచి ఉన్నాం. యిటువంటి అవకాశాలవలన మనం, 2వ కొరింథీయులకు కలిగిన ప్రశ్నలను పంచుకొనడానికి తగిన కారణం ఏర్పడింది. 2వ కొరింథీయులలో ప్రస్తావించబడిన విశ్వసనీయమైన క్రైస్తవుని గురించిన ఆనవాళ్ళు నేటి క్రీస్తు పరిచారకుని చిహ్నాలయ్యాయి. పౌలు తనను పరీక్షించుచున్న వారిని హెచ్చరించాడు: "మీరు విశ్వాసముగలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి" (13:5).

## 2 కొరింథీయులను చదువుచుండగా

2 కొరింథీయుల పత్రికను చదువుతున్నవారు, ఈ పుస్తకములోని ప్రతి పేజీ ఆచరణాత్మకంగా విశ్వసనీయమైన క్రైస్తవ్యాన్ని గురించినదైయున్నప్పటికి, కొన్ని సందర్భాలలో పౌలు తీరు, ఆయన దృష్టి మారుతున్నట్టు గుర్తించలేక పోతున్నారు. పౌలు పరిచర్యనుబట్టి కొరింథీయులు తాము కావించిన గత ధిక్కారాలకు పాశ్చాత్తాపపడ్డారని తీతు తెచ్చిన మంచి సందేశానికి పౌలు సంతసించినట్టు పత్రికలోని కొన్ని భాగాలు సూచిస్తున్నాయి. కొరింథీయుల సమస్యవలన వేదనకు గురియైన పౌలు మనస్సుకు ఇప్పుడు నెమ్మది కలిగిందని ఈ భాగాలవలన తెలుసుకుంటాం (2:12, 13). ఏమైనా 10 నుంచి 13వరకు గల అధ్యాయాలలో పౌలు పరిచర్య తీవ్రమైన ధిక్కారానికి గురియైనట్టు అతడు ధ్వనిస్తాడు. అతడు నిజమైన క్రైస్తవుడని (10:7; 11:23) సంఘమునకు తప్పక నిరూపించవలసిన వాడయ్యాడు! సంఘానికి తన మూడవ ప్రయాణానికి సిద్ధపడుతూ, అక్కడ అతనికి ఎలాంటి ఆహ్వానం లభిస్తుందనే విషయాన్ని సందేహించాడు. కొరింథీ పట్టణానికి చేసిన రెండవ ప్రయాణంలో ఎదుర్కొన్న సమస్యలాంటివే ఎదురౌతాయని పౌలు ఆందోళన చెందాడు (పోల్చు 2:1-4). ఈ అధ్యాయాలు సమస్యలింకా తీరిపోలేదని సూచిస్తాయి. సంఘ జీవితం ఎప్పుడూ ఆందోళన కరంగానే మిగిలి ఉంది!

2 కొరింథీయులలోని ఇతర భాగాలు చర్చనీయాంశాలకు అంతరాయం కలిగిస్తాయి. ఉదాహరణకు, 6:14-7:1, క్రైస్తవులు "అవిశ్వాసులతో కలిసియుండుటను" హెచ్చరించు వాక్య భాగం 6:13 మరియు 7:2లోని భావాలను ఆటంకపరచాయి. అందుకు తోడుగా, కానుకులలో పాలుపొందుట యొక్క అవశ్యకతను తెలిపే రెండు వేవేరు పాఠాలు ఈ పుస్తకంలో ఉన్నాయి

(8 మరియు 9 అధ్యాయాలు). రెండవ పాఠం 9:1లో ఆరంభం అవుతుంది: “పరిశుద్ధులకొరకై ఈ పరిచర్యను గూర్చి నీ పేర వ్రాయుటకు నాకు అగత్యము లేదు. ...”

ఈ పత్రిక రచనలో కలిగిన అంతరాయాలకు సులువైన వివరణ ఏదీ లేదు. ఎంతోమంది పండితులు, ఈ పుస్తకంలో కొన్నిసార్లు సమస్య పరిష్కరింపబడినట్టు (7వ అధ్యాయం) మరి కొన్నిసార్లు పరిష్కరింపబడనట్టు (10 నుండి 13 అధ్యాయాలవరకు) ఉన్నది ఎందుకని వాదించారు. ఇటువంటి అంతరాయాలవల్ల పత్రిక అంతా ఒక్కసారే వ్రాసింది కాదని తెలియవస్తుంది. బహుశ కొరింథీలోని పరిస్థితులు పెక్కు పర్యాయాలు మార్పుచెంది ఉండవచ్చు. పౌలులోని అస్థిర భావాలు సంఘంలో మారుతున్న పరిస్థితులను ప్రతిబింబిస్తాయి.

ఈ పత్రికలోని ఈ మార్పులు మన సంఘ జీవితం కొరింథీ సంఘములోని అనుభవములాంటిదని మనకు జ్ఞాపకం చేస్తుంది. సమస్యలను తీరిన సందర్భం ఒక్కటీ కనిపించదు, పాత సమస్యలకు బదులు క్రొత్తవి కలుగుతుంటాయి. ఒక సమస్య తీరింది అనుకునే సమయానికి, అవి సంఘ చరిత్రలో గడిచిన క్షణాలుగానే మిగిలిపోతాయి. సంఘ జీవితం ఎప్పుడు ఉద్రిక్తంగా ఉంటుందని కొరింథీయులకు వ్రాసిన పత్రికలు జ్ఞప్తి చేస్తాయి.

## ముగింపు

నిజమైన క్రైస్తవుని గుర్తింపు ఏది? సంఘంలో జరిగే ఎన్ని కార్యక్రమాలు “పరిచర్య కావించుకొనుటకు కాదు, పరిచర్య చేయుటకు వచ్చాను” అన్న విధిని నిర్వహిస్తాయి. కొరింథీయులకు తప్పనిసరి నిర్ణయం కావించకొనవలసిన పరస్థితి ఏర్పడింది.

వర్తమాన సంఘం, అందలి కార్యక్రమాలను నియమ బద్ధం చేసుకొనుటకు అనేక విధాలను సరితూచుకుంది, అనేక తీర్మానాలను కూడా ఎదుర్కొంది. అందువల్ల 2 కొరింథీయులు మనకు కలుగుతున్న సందేహాలకు జవాబు నివ్వగలదు.